కుమార పోటీపై బీజేపీదే నిర్ణయం: దేవెగౌడ

బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కుమారస్వామి పోటీపై బీజేపీ అగ్రనేతలు, ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయం తీసుకుంటారని జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయం జేపీ భవన్‌లో రాష్ట్ర మహిళా విభాగం సభలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారం రోజుల్లో కుమారస్వామి ఢిల్లీ వెళ్తారని వివరించారు. అభ్యర్థులు, నియోజకవర్గాలు అన్నీ ఖరారవుతాయన్నారు. కాగా జయదేవ ఆసుపత్రుల మాజీ డైరెక్టర్ డాక్టర్ సీఎన్ మంజునాథ్ రాజకీయాల్లోకి వచ్చే విషయంపై ఆయనదే నిర్ణయమన్నారు.

అన్నదాతలకు అండగా నిలవండి

- సాగుపై విస్తృత పరిశోధనలు చేయండి
- వాతావరణ మార్పులపై దృష్టి సారించాలి
- వ్యవసాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్ పిలుపు



స్నాతకోత్సవంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, మంత్రి చెలువరాయ స్వామి



బంగారు పతకాలతో విద్యార్థినులు

బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సాగుపై విస్తృతమైన పరిశోధనలతో అన్నదాతలకు అండగా నిలవాలని గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ పిలుపునిచ్చారు. సోమవారం బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం 58వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ మాట్లాడుతూ డిగ్రీ పట్టాలు పొందుతున్నవారంతా వ్యవసాయ రంగంకోసం భవిష్యత్తులో పరిశోధనల్లో ఆవిష్కరణలు చేయాలన్నారు. బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశవ్యాప్తంగా ఆదర్శమైనదనే పేరుగాంచిందన్నారు. నూతన వంగడాలు, సాగుకు అనుకూలమైన సాంకేతిక పరికరాల రూపకల్పనలో కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఫెలోషిప్‌లో ఇక్కడి విద్యార్థులే ఏటా అగ్రస్థానంలో ఉండడం సంతోషదాయకమని అన్నారు. వ్యవసాయమంటే పంట దిగుబడులు మాత్రమే కాదని, సంస్కృతి, జీవనం, పశు సంపద, పాడి వంటివి ఉన్నాయన్నారు. రెండు దశాబ్దాల కాలంలో సాగులో ఆధునికత సాధ్యమైందని, అయితే వాతావరణంలో మార్పులు సాగుకు నష్టాలు కలిగిస్తున్నాయని అన్నారు. నెలల తరబడి కష్టపడి సాగు చేసిన పంటలకు గంటల వ్యవధిలో ప్రకృతి ద్వారా నష్టం కలుగుతోందన్నారు. వాతావరణంలో మార్పులపై పరిశోధనలు జరగాలన్నారు. మార్కెటింగ్‌లో ఆన్‌లైన్ విధానం రావడంతో ధరల గురించి తెలుసుకునే వెసులుబాటు ఉందన్నారు. జొన్న, బియ్యం, కందులు, రాగులతోపాటు కూరగాయలు, ఆకూ కూరల్లోనూ అనేకమైన వంగడాలను పరిచయం చేశారన్నారు. 23ఏళ్లలో 480 పరిశోధనలతో వ్యవసాయ ఆధునికతను అభివృద్ధి చేసిందని కొనియాడారు. 1244 మందికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేశారు. 69 మందికి బంగారు పతకాలు ప్రదానం చేశారు. స్నాతకోత్సవంలో వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయస్వామి, వ్యవసాయ విశ్వవిద్యాలయం కులపతి సురేష్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెంపణ్ణ

కమీషన్ తీసుకున్నట్లు నిరూపిస్తారా..?

- రాజకీయాలకు గుడ్‌బై చెబుతా
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య సవాల్

బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల నుంచి ఐదు పైసల లంచం తీసుకున్నానని నిరూపించినా రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని ముఖ్యమంత్రి సిద్దరామయ్య సవాల్ విసిరారు. ముఖ్యమంత్రిగా తన వ్యవధిలో ఎవరి నుంచి కూడా లంచం తీసుకోలేదని స్పష్టం చేశారు. సోమవారం ప్యాలెస్ మైదానంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కాంట్రాక్టర్ల సమావేశంలో సీఎం మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎల్‌ఓసీ రిలీజ్ చేసేందుకు తాను లంచం తీసుకున్నట్లు కాంట్రాక్టర్ ఎవరైనా బహిరంగ పరిస్తే రాజీనామా చేస్తానని తెలిపారు. సీఎంగా సూచించినా, ఆదేశించినా గ్రాంట్లు లేకుండా పనులు చేయరాదని పేర్కొన్నారు. తద్వారా కాంట్రాక్టర్‌లకే సమస్య తలెత్తుతుందన్నారు. మీకు కోట్లాదిరూపాయల బకాయిలు ఉన్నాయని, వాటిని ఎక్కడి నుంచి తీసుకురావాలన్నారు. ఇదే సందర్భంగా సీఎంకు కాంట్రాక్టర్లు తమ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు అధికారులు, రాజకీయ నాయకుల నుంచి వేధింపులు ఉన్న విషయం తన దృష్టిలో ఉందన్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం ఏదైనా రాజకీయ పార్టీలకు కాంట్రాక్టర్లు దూరంగా ఉండాలని సూచించారు. రానున్న 9 ఏళ్ల తామే అధికారంలో ఉంటామన్నారు. మీ సమస్యలను పరిష్కరిస్తామని, ఇది గుర్తుంచుకోవాలన్నారు. తాము ప్రభుత్వాన్ని నడుపుతామని, మీరు పనులు చేస్తారని చెప్పారు. ఇవి రెండూ దేశ ప్రగతికి అనుబంధమైనవన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మీ భాగస్వామ్యం ఉందన్నారు. గత ప్రభుత్వం సమగ్రమైన పథకాలు తీసుకురాకుండా మిమ్మల్ని తప్పుబట్టిందన్నారు. జలవనరులశాఖలో రూ.16వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించి రూ.25వేల కోట్లకు అనుమతులు ఇచ్చారన్నారు. కేవలం జలవనరులశాఖలోనే రూ.1.25 లక్షల కోట్ల పనులు సాగుతున్నాయన్నారు. కాంట్రాక్టర్లు ఎలా పని చేయాలని, ప్రభుత్వం బిల్లులు ఎలా సమకూర్చాలని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు అవినీతి మరక అంటిందన్నారు. ప్యాకేజ్ పద్ధతి రద్దు చేయాలని, బాకీ మొత్తం విడుదల చేయాలని భావిస్తున్నామన్నారు.

తెలంగాణలో రోడ్డు ప్రమాదం.. బళ్లారి వాసులు ఐదుగురి మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు

బళ్లారి రూరల్, మార్చి 4 : తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లాలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బళ్లారి వాసులు ఐదుగురు మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బళ్లారి నగరం బసవన కుంట గ్రామానికి చెందిన అబ్దుల్ రెహమాన్ కుటుంబం హైదరాబాద్‌లోని బంధువుల శుభ కార్యానికి కారులో బయలుదేరారు. 44వ జాతీయ రహదారిపై కొత్తకోట బైపాస్ టెక్కలయ్య దర్గా వద్ద డ్రైవర్ నిద్రమత్తులో వుండటంతో కారు అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొంది. ఈ ఘటనలో అబ్దుల్ రెహమాన్ (30), ఫాతిమా (50), వానీ (2), మరియమ్, బుష్రా మృతి చెందారు. అటుగా వెళుతున్న వాహనదారులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. గాయపడిన వారిలో ముగ్గురు పరిస్థితి విషమంగా వున్నట్లు తెలుస్తోంది.



చెట్టును ఢీకొన్న కారు

ఎఫ్ఎస్ఎల్ నివేదిక బహిర్గతం చేయాలి

- డీజీపీకి బీజేపీ నేతల వినతి

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల ఫలితాల సమయంలో విధానసౌధలో కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నాసిర్ హుసేన్ అనుచరులు చేసిన పాకిస్థాన్ జిందాబాద్ నినాదాలు నిజమేనని పలు కథనాలు స్పష్టం చేస్తున్నాయని బీజేపీ పేర్కొంది. నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు వీడియో క్లిప్పింగులను ఎఫ్ఎస్ఎల్‌కు పంపించి రోజులు గడుస్తున్నా ఇంతవరకు నివేదిక బహిర్గతం కాకపోవడంపై బీజేపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఫిబ్రవరి 27న విధానసౌధ కారిడార్‌లో జరిగిన ఘటనకు సంబంధించి నిజానిజాలను బయట పెట్టాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని పేర్కొంది. ఈ మేరకు బీజేపీ ఎమ్మెల్యేల బృందం సోమవారం డీజీపీ అలోక్‌మోహన్‌కు వినతి పత్రం సమర్పించింది. ఎఫ్ఎస్ఎల్ నివేదికను తక్షణం బయటపెట్టాలని వినతిపత్రంలో పేర్కొంది. ప్రజలకు వాస్తవాలు తెలియచేయడంతోపాటు నిందితులకు దేశద్రోహలకు కఠినశిక్ష పడేలా చేసేందుకు ఇది చాలా అవసరమని పేర్కొంది. రాష్ట్ర పోలీసులు ఈ విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా ఎఫ్ఎస్ఎల్ నివేదికను యథాతథంగా బహిర్గతం చేయాలని వినతి పత్రంలో కోరింది. ఇప్పటికే ఎఫ్ఎస్ఎల్ నివేదిక విడుదలలో బాగా జాప్యం జరిగిందని, ఇదిలాగే కొనసాగితే దేశద్రోహలకు సంఘ విద్రోహశక్తులకు మరింత ఊతమిస్తుందని పేర్కొంది. డీజీపీని కలసిన ఎమ్మెల్యేల బృందంలో రవిసుబ్రమణ్య, సీకే రామమూర్తి, ఉదయ్ గరుడాచార్, మాజీ ఎమ్మెల్యే నందీశ్‌రెడ్డి తోపాటు పలువురు సీనియర్ నేతలు ఉన్నారు.

ఇలాంటి నినాదాలు కేన్సర్‌లాంటివి : ప్రమోద్ ముతాలిక్

పాకిస్థాన్ అనుకూల నినాదాలు దేశానికి కేన్సర్ కంటే ప్రమాదభరితమైన వైరస్‌లాంటివని శ్రీరామసేన జాతీయ అధ్యక్షుడు ప్రమోద్ ముతాలిక్ పేర్కొన్నారు. కారవారలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఈ వైరస్‌ను అంతమొందిస్తే తప్ప భారత్‌కు పరిపూర్ణ సురక్షత లభించదన్నారు. బీజేపీ హయాంలోనూ బాంబు పేలుళ్ల జరిగాయని, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలోనూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. దర్యాప్తు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీల నేతలు మౌనంగా ఉంటే మంచిదని హితవు పలికారు. రామేశ్వరం కెఫె బాంబుపేలుళ్ల ఘటన పక్కా ప్రణాళికతో జరిగిందన్నారు. దర్యాప్తును ఎన్ఐఏకు అప్పగించాలని డిమాండ్ చేశారు.



వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ ఎమ్మెల్యేల బృందం

'పాక్' నినాదాలు చేసినవారు దేశద్రోహులే : స్పీకర్

బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విధానసౌధ ప్రాంగణంలో ఒకవేళ పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేసి ఉంటే అది దేశద్రోహం కిందకే వస్తుందని శాసన సభ స్పీకర్ యూటీ ఖాదర్ స్పష్టం చేశారు. బెళగావి పర్యటనలో భాగంగా సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రామేశ్వరం కెఫె బాంబు పేలుళ్ల ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది కూడా దేశద్రోహం కిందికే వస్తుందన్నారు. సమాజంలో శాంతి సామరస్యాలను దెబ్బతీసే శక్తులను నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఇలాంటి ఘటనల ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు ఎవరూ ప్రయత్నించరాదన్నారు. కర్ణాటక శాంతికి పెట్టింది పేరని, విద్వేషాలు, భావోద్వేగాలు పెరుగుతుండడం విచారకరమన్నారు.

వేసవిలో భక్తుల కోసం ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

- దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈసారి వేసవి తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా భక్తుల కోసం తగిన ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్రంలోని ఆలయాల పాలక మండళ్లకు దేవదాయ, రవాణా శాఖల మంత్రి ఆర్ రామలింగారెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన మౌఖిక సూచనలు చేశారు. శక్తి ఉచిత రవాణా సదుపాయం కారణంగా ఇప్పటికే ఆలయాలను సందర్శిస్తున్న మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, వేసవి సెలవుల అనంతరం ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. వేసవి తీవ్రత తగ్గేంతవరకు అన్ని ఆలయాల్లో తాత్కాలిక పందిళ్లు, షామియానాలను ఏర్పాటు చేయాలని, భక్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలని మంత్రి సూచించారు. అవసరమైతే ఇందుకు దాతల సాయం తీసుకోవాలని కోరారు. ఒకవేళ దాతలు ఎవరూ ముందుకు రానట్లయితే దేవదాయ శాఖ నిధుల నుంచే ఇందుకు ఖర్చు వెచ్చించాలని, ఆపై ప్రభుత్వం ఈ మొత్తాన్ని చెల్లిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో రద్దీ పెరగడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి సూచించారు. సోమవారం మంత్రి తిరుమలకు వెళ్లి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో విలసిల్లాలని, ఈసారి వానలు సకాలంలో కురియాలని రాష్ట్రం, సస్యశ్యామలం కావాలని శ్రీవారిని ప్రార్థించినట్లు మంత్రి వెల్లడించారు.

భక్తజన సంద్రం

- వైభవంగా కొట్టూరు బసవేశ్వరస్వామి రథోత్సవం

అశేష భక్తజన సందోహం మధ్య విజయనగర జిల్లాలోని కొట్టూరు గ్రామంలో బసవేశ్వరస్వామి రథోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. భక్తులు రథోత్సవంలో పాల్గొని స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు. మరికొందరు భక్తులు పాదయాత్రగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అమృతాభిషేకం, బిల్వార్చన, రుద్రాభిషేకం, పూజలు చేపట్టారు. మహిళలు కలశాలతో రథోత్సవానికి పూజలు చేశారు. సాయంత్రం ఆలయం ముందు నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు లక్షలాది మంది భక్తుల మధ్య రథోత్సవాన్ని ఊరేగించారు. ఈ రథోత్సవానికి వివిధ ఆలయ మఠాధిపతులు పాల్గొన్నారు. భక్తులకు దాతలు అన్నదానం, మజ్జిగ, నీళ్ల పంపిణీ చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


- కంప్లి



ప్రత్యేకాలంకరణలో కొట్టూరు బసవేశ్వరస్వామి

లక్షలాది భక్తుల నడుమ ఊరేగుతున్న స్వామివారి రథం





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.30	1,603.71
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	885	7,095
సామర్థ్యం (టీఎంసీలు)	8.21	28.71

వర్క్‌ఫ్రమ్ హోం పేరుతో
రూ 2.20 లక్షలకు టోపీ

బళ్లారి గాంధీనగర్, మార్చి 4: 'వర్క్‌ఫ్రమ్ హోం' పేరుతో ఆశచూపి మహిళ నుంచి రూ 2.25లక్షలు కాజేసిన ఘటన బళ్లారి నగరంలో చోటు చేసుకుంది. ఈ మేరకు సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని కౌల్ బజార్‌లో నివాసం ఉండే ఓ మహిళకు ఇండియన్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. ఈ ఖాతాకు మొబైల్ నెంబరు, ఫోన్‌పే లింక్ పొందింది. ఈ మధ్యనే టెలిగ్రామ్ అకౌంట్‌కు "వి-2023 గ్లోబల్ హై శ్యాలరీ గ్రూప్" పేరుతో వర్క్ ఫ్రమ్ హోం ఆశ చూపారు. టాస్క్ ఇస్తామని, అందుకు 30శాతం కమీషన్ ముందుగానే జమ చేయాలని నమ్మపలికారు. ఆన్‌లైన్ ద్వారా ఆ మహిళ నుంచి రెండు విడతలుగా రూ 2.25లక్షల రూపాయలు లాగేశారు. డబ్బు ముట్టగానే... అకౌంట్ కాస్త పనిచేయక పోవడంతో మోసపోయానని గ్రహించిన మహిళ స్థానిక సైబర్ పోలీసులను ఆశ్రయించింది. సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

96 శాతం పల్స్ పోలియో

బళ్లారి సిటీ, మార్చి 4: బళ్లారి జిల్లాలో పల్స్ పోలియోలో 96శాతం పూర్తయినట్లు కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు సోమవారం ప్రకటించారు. జిల్లాలో జాతీయ పోలి యో ప్రచారంలో భాగంగా బళ్లారి, సండూరు, సిరుగుప్ప, కురుగోడు, కంప్లి తాలూకాలలో 197,103 పి ల్లలకుగాను ఆదివారం బూత్ రోజున 180.229 సంవత్సరాలలోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేశామన్నారు. బళ్లారి తాలూకాలో 17,831 మంది పిల్లలకు గాను 17,266 మంది పిల్లలకు, సండూర్ తాలూకాలో 35,392 మంది పిల్లలకుగాను 33,721 మంది పిల్లలకు, సిరుగుప్పలో 36,326 పిల్లలకు గాను 34,814 మంది పిల్లలకు టీకాలు వేశారన్నారు. పిల్లలందరికీ టీకాలు వేయడానికి 333వలస క్లిష్టమైన ప్రాంతాలను గుర్తించారు. ఇలాంటి చోట్ల టీకాలు వేసేందుకు 174 బృందాలను సిద్ధం చేశామన్నారు.

లోక కల్యాణానికి మహాసుదర్శన హోమం

బళ్లారి సిటీ, మార్చి 4: ప్రపంచంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరియాలని కాంక్షిస్తూ నగరంలోని సత్యనారాయణ పేట సుశీమీంద్ర తీర్థ కల్యాణ మండపంలో సోమవారం మహాసుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రోధి నాయ సంవత్సర గౌతమ సూర్య సిద్ధాంత పంచాంగ విడుదల చేసి గౌతమ సిద్ధాంతి మాట్లాడారు. హోమంలో భాగంగా శ్రీ విద్యాసింధు మాధవతీర్థ గురువుల అమృత హస్తం నుంచి 2024-25 సంవత్సరంలో మంచి వర్షాలు కురుస్తాయని వాగ్దానం చేస్తూ మహాసుదర్శన హోమం నిర్వహించడం జరిగిందన్నారు. గిరీశ్, అశోక్ కులకర్ణి, కరణం శ్రీనివాస్‌ప్రసాద్, శ్రీనాథ్, ప్రముఖ జ్యోతిష్య పండితులు గురురాజ కులకర్ణి పాల్గొన్నారు.

కలుషితం..కలవరం..

● వ్యర్థాలతో కలుషితమవుతున్న తుంగభద్ర నీరు ● పరిశోధనలో బయట పడిన నిజాలు

బళ్లారి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంలో నీరు కలుషితం కావడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డ్యాం ఇరువైపులా సుమారు 5 నుంచి 10 కిలో మీటర్ల వరకు పలురకాల వ్యర్థాలు పారేస్తుండంతో నీరు కలుషితం అవుతున్నట్లు శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల పర్యావరణ శాఖ, ఆరోగ్యశాఖ, నీటిశుద్ధి పరిశోధన శాఖలు, భూగర్భ జలవనరుల పరిశోధన శాఖ చేసిన పరిశీలనలో పలు విషయాలు తేటతెల్లమయ్యాయి. తుంగభద్ర నది నీటిలో అల్యూమినియం మెటల్, ఉన్నట్లు గుర్తించారు. తుంగభద్ర డ్యాం, అలాగే నదితో పాటు ఈప్రాంతంలో ఉన్న సుమారు18 ప్రాంతాల్లో ఉన్న చెరువులు, డ్యాంలు, అందులలోని మట్టి, నీరును జాతీయ నది జలవనరుల శాఖ పరిశోధించింది, ఈ ప్రాంతంలో ఉన్న నీరు,చెరువుల్లో రాగి, సీసం, జింక్, నికెల్, ఇనుము, మాంగనీస్, కాడ్మియం, క్రోమియం, అల్యూమినియం లోహాలు ఉన్నట్లు పరిశోధకులు వెల్లడించారు. తుంగభద్ర నీటిని వాటర్ స్టోరేజ్ లలో నిల్వ చేసి బళ్లారి, రాయచూరు, కొప్పళ, తదితర జిల్లాల ప్రజలు, మూగ జీవాలు తాగుతున్నారు. కలుషితం అయిన నీరు తాగడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతారని పరిశోధన సంస్థలు అభిప్రాయపడుతున్నారు. గతంలో జరిగిన విధాన విధానసభ సమావేశాల్లోనూ ప్రతిపక్ష నాయకులు ఈ విషయం లేవనెత్తారు. ఎమ్మెల్సీ సతీష్‌బాబు తుంగభద్ర జలాశయంలో నీరు కలుషితం అవుతున్న అంశాన్ని ముఖ్యమంత్రిదృష్టికి తీసుకెళ్లారు. నీరు కలుషితం కాకుండా చూడడం, అలాగే ఇప్పటికే కలుషితం అయిన ప్రాంతాన్ని శుద్ధి చేయాలని కోరారు. తుంగభద్ర జలాశయం చుట్టూ కలుషితం అవుతుండడం తో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కలుషితమైన తుంగభద్ర జలాశయం

రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ పోటీల్లో
జిల్లాకు 13 స్వర్ణాలు, 2 రజతాలు

బళ్లారి సిటీ, మార్చి 4: బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లోని జీ స్వీమ్ అకాడమిలో జరిగిన 2023-24 రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో బళ్లారి జిల్లా మొత్తం 13 బంగారు పతకాలు, 2రజత పతకాలను కైవశం చేసుకుంది. ఈతగాళ్లు గోపీచంద్, యోజిత్‌చ సాయిబేబి, సాయి నిఖిల్, కవిత జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వివిధ విభాగాల్లో స్విమ్మింగ్ పోటీల్లో గోపిచంద్‌కు 3బంగారు పతకాలు, యోజిత్‌కు 3బంగారు పతకాలు, సాయిబేబికి 3బంగారు పతకాలు, సాయి నిఖిల్‌కు 2బంగారు, 1రజత ం, వకితకు 2బంగారు, 1రజతపతకాలు లభించాయి. వీరు మార్చి 29నుండి 31వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ క్రీడల్లో రాష్ట్రం తరపున పాల్గొననున్నారు. క్రీడల శాఖ మంత్రి నాగేంద్ర, సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాఎస్పీ రంజిత్ కమార్ బండారు. రాహుల్ శరణప్ప, కమిషనర్ హేమంత్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా, క్రీడా శాఖ సహాయ సంచాలకులు గ్రేసీ అభినందనలు తెలిపారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

హోటల్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ అభినందనీయం : డీసీ

బళ్లారి సిటీ, మార్చి 4: జిల్లా వాణిజ్య , పరిశ్రమల మండలి ఆధ్వర్యంలో నిరుద్యోగులకు హోటల్ మేనేజ్‌మెంట్ ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ప్రశంసించారు. సోమవారం బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంస్థ, జిల్లా పరిపాలన, జిల్లాపంచాయతీ, జిల్లాపారిశ్రామిక కేంద్రం, నైపుణ్యాభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బళ్లారి ఛాంబర్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్‌లో ప్రారంభించిన హోటల్ మేనేజ్‌మెంట్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. స్టార్ హోటల్ లాంటి స్కిల్ సెంటర్‌లో శిక్షణకు అవసరమైన కిచెన్, రెస్టారెంట్, బెడ్, హౌస్‌కీపింగ్, కంప్యూటర్ బిల్లింగ్ వ్యవస్థను బళ్లారి జిల్లావాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ప్రారంభించిందన్నారు. నిరుద్యోగులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ యువత చదువు పూర్తయ్యాక నైపుణ్యం లేకపోవడతో సరైన ఉద్యోగాలు, సరైన వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హోటల్ మేనేజ్‌మెంట్ శిక్షణ ఎంతో మంది యువతకు ఉపాధి కల్పిస్తుందన్నారు. బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల శాఖ సీనియర్ ఉపాధ్యక్షుడు యశ్వంత్‌రాజ్‌నాగిరెడ్డి మాట్లాడుతూ ఛాంబర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అందిస్తున్న హోటల్ మేనేజ్‌మెంట్ శిక్షణ నాణ్యమైనదని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి త్వరగా ఉపాధి లభిస్తుందన్నారు. పరిశ్రమల సంఘం గౌరవాధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ హోటల్ నిర్వహణపై 45రోజుల నైపుణ్య శిక్షణన ఉచితంగా అందజేసి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి అధికారి హట్టప్ప, మంజునాథ్, దొడ్డనగౌడ, సొంతగిరిధర్, రామచంద్ర, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ నాగల్లి రమేశ్, శ్రీనివాసరావు, మండలి చైర్మన్ మహారుద్రగౌడ, సురేశ్‌బాబు, కార్యవర్గసభ్యులు, సమన్వయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి శిక్షణను ప్రారంభిస్తున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

అనుమతి లేకుండా
ఫ్లెక్సీలు ముద్రిస్తే కఠినచర్యలు : కలెక్టర్

బళ్లారి సిటీ, మార్చి 4: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ముందస్తు అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, కరపత్రాలు , బ్యానర్‌ల ముద్రణ చేపట్టరాదని జిల్లా ఎన్నికల అధికారి జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా హెచ్చరించారు. సోమవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయ హాల్లో జిల్లాలోని ప్రింగింగ్ ప్రెస్ యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎలాంటి రాజకీయ ప్రచారం, మతపరమైన అల్లర్లు సృష్టించే బ్యానర్లు, హోర్డింగ్‌లు, కరపత్రాలు ముందస్తు అనుమతి లేకుండా ముద్రించరాదన్నారు. ముద్రణకు మూడు రోజుల ముందు అనుమతి తీసుకోవాలన్నా రు. ఎన్నికల కరపత్రాలను ముద్రించే సమయంలో జిల్లా ఎన్నికల అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రింటింగ్ పేరు,ప్రచురణకర్త పేరు, ముద్రించిన పరిమాణం వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మతపరమైన అల్లర్లను సృష్టించే ఎలాంటి ప్రచారాలు , తప్పుడు సమాచారం, కరపత్రాలు, ముద్రించరాదన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటిం చకపోతే శిక్షార్హులు అవుతారన్నారు. ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేరా, జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా , అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేరా



మైనింగ్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీసీ చంద్రశేఖర్ నాయక్

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి

● జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్ ఆదేశం

రాయచూరు, మార్చి 4 : జిల్లాలో పెద్ద ఎత్తున సాగుతున్న అక్రమ ఇసుక రవాణాకు వెంటనే అడ్డుకట్ట వేయాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ ఆదేశించారు. మైనింగ్ పాలసీకి సంబంధించి ఆ శాఖ ప్రగతి పరిశీలన సభ సోమవారం జిల్లాధికారి కార్యాలయంలో నిర్వహించారు. రవాణా, భూగర్భ ఖనిజ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లాధికారి ఇసుక అక్రమ రవాణా పై పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్న విమర్శల పై అధికారులను నిలదీశారు. పత్రికల్లోను ఇతర టీవీ చానల్‌లోను ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి పెద్ద ఎత్తున కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తం కావాలన్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న కృష్ణ-తుంగభద్ర నదుల నుంచి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష

బళ్లారి రూరల్, మార్చి 4: హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష ఖరారైంది. నగరంలోని హరిశ్చంద్ర నగర్‌కు చెందిన నాగరాజు అలియాస్ మణి (25)ని మే 12, 2022న హత్య చేశారు. ప్రధాన నిందితులు ఏ1 కృష్ణ, ఏ2 మల్లికార్జున, ఏ3 ప్రభు అలియాస్ గణేష్‌లను గతంలోని రూరల్ సీఐ శ్రీనివాసరావు అరెస్టు చేశారు. మరో సీఐ రామన్న, బిరదర్ నిందితులను విచారించారు. వాదోపవాదాల అనంత రం న్యాయమూర్తి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

చిరుత దాడిలో ఆవుదూడ మృతి

రాయచూరు, మార్చి 4 : జిల్లాలోని దేవదుర్గ తాలూకా జాలహళ్లి గ్రామ సమీపంలోని తోటలో ఓ ఇంటి ముందు కట్టేసి ఉంచిన ఆవుదూడపై చిరుత దాడి చేసింది. ఈ సంఘటన ఆ దివారం అర్ధరాత్రి చోటు చేసుకోగా చిరుత దాడిలో దూడ మృత్యువాతపడింది. దూడను సగం వరకు తినేసిన చిరుత అక్కడ నుంచి పరారయ్యింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి చిరుత జాడలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో జాలహళ్లిలో ఒక్కసారిగా భయం వాతావరణం నెలకొంది. అటవీ శాఖ అధికారులు బోన్లు ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని వారు కోరారు.

ఎస్కేయూ చాన్స్‌లర్‌గా విజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



విజయ కుమార్ మాలశెట్టిని అభినందిస్తున్న అనంత్ జుండేకర్

బళ్లారి సిటీ, మార్చి 4: బళ్లారి విజయనగరం శ్రీకృష్ణ దేవరాయ ప్రొఫెసర్ విజయకుమార్ మాలశెట్టి సోమవారం చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ చాన్స్‌లర్ డాక్టర్ అనంత్ ఎల్ జుండేకర్ పదవీకాలం ముగియడంతో విజయకుమార్ బాధ్యతలు స్వీకరించారు.

డీజీపీకి సత్కారం

బళ్లారి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'బుడా'కు రెండవ సారి అధ్యక్షుడిగా ఎన్నిక అయిన జేఏస్ ఆంజనేయులు సోమవారం మర్యాద పూర్వకంగా డీజీపీ లోకేష్ బాబును కలిశారు. డీజీపీకి పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. రామరాజు, ఎర్రిస్వామి ఉన్నారు.



డీజీపీ లోకేష్ కుమార్‌ను సత్కరిస్తున్న బుడా చైర్మన్ జేఎస్ ఆంజనేయులు

చారిత్రక కట్టడాలను కాపాడండి: డీఎస్ఎస్

రాయచూరు, మార్చి 4 : నగరంలో వెలసిన చారిత్రక కోట, కందకాలను ఆక్రమించకుండా అడ్డుకట్ట వేయాలని దళిత సంఘర్షణ సమితి నాయకులు కోరారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయంలో యూనియన్ తరపున వినతి పత్రం అందజేశారు. నగరంలోని ఎల్‌బీసీ కార్యాలయం ఎదురుగా కేఈబీ కార్యాలయం పక్కన ఉన్న కందకం, కోట స్థలాన్ని కొంత మంది ప్రైవేటు వ్యక్తులు రాజకీయ పలుకుబడితో ఆక్రమించినట్లు ఆరోపించారు. గతంలో ఇలాంటి ప్రయత్నమే చేయగా ప్రజా సంఘాలు అడ్డుకోవడంతో అప్పట్లో నగరసభ అధికారులు జోక్యం చేసుకుని నిర్మాణాలను తొలగించినట్లు గుర్తు చేశారు. తిరిగి నాల్గైదు రోజుల క్రితం అదే స్థలంలో రాత్రి-పగలు తేడా లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత నగరసభ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల కోట పరిసరాల్లో చిన్నపాటి డబ్బా వెలసినా దాన్ని వెంటనే తొలగించిన అధికారులు ఇంత పెద్ద ఎత్తున నిర్మాణం జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఈ విసయంలో నగరసభ అధికారుల తీరు అనుమానాస్పదంగా ఉందని జిల్లాధికారి జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.



వినతి పత్రం అందజేస్తున్న డీఎస్ఎస్ నాయకులు

ప్రతి ఇంటిపై ఎయిమ్స్ పోరాట జెండా..

రాయచూరు, మార్చి 4 : జిల్లాలో జాతీయ విద్యా సంస్థ ఎయిమ్స్ ఏర్పాటు కోసం సాగుతున్న ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని పోరాట కమిటీ నాయకులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ప్రతి ఇంటి పై ఎయిమ్స్ పోరాట జెండా పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెండాను సోమవారం ఎయిమ్స్ పోరాట సమితి నాయకులు విడుదల చేశారు. జిల్లా కేంద్రం రాయచూరు నగరంలోని మహాత్మ గాంధీ క్రీడామైదానంలో ఎయిమ్స్ ఏర్పాటు కోరుతు సాగుతున్న నిరవధిక నిరాహార దీక్ష సోమవారం నాటికి 662వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నాయకులు ఎయిమ్స్ సాధన పోరాటాన్ని ఇంటింటికీ విస్తరించాలని కోరారు. ఈ క్రమంలో విద్యావంతులు ప్రజలు తమ పోరాటానికి సహకరించాలని కోరారు. రాష్ట్రానికి ఎయిమ్స్ మంజూరైన నేపథ్యంలో దాన్ని రాయచూరులోనే ఏర్పాటు చేయాలన్నది ప్రతి పౌరుడి డిమాండ్‌గా ప్రభుత్వానికి వినిపించాలని కోరారు.



జెండాను విడుదల చేస్తున్న ఎయిమ్స్ పోరాట సమితి నాయకులు

హోసూరు జోన్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హోసూరు, మార్చి 4: హోసూరు దక్షిణ తిరుపతిగా పేరొందిన వెంకటేశ్వర స్వామి దేవాలయం గోపసంద్రం గ్రామంలో ఉంది. ఆలయ 21వ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం విశేషపూజలు నిర్వహించారు. తిరుకల్యాణ వైభోగం అనంతరం స్వామి వారికి వేద మంత్రోచ్చారణ, మహా మంగళహారతి చేశారు. ఇందులో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వార్షికోత్సవంలో భాగంగా సామాజిక సేవలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి సేవా ట్రస్ట్, బెంగళూరు నారాయణ నేత్రాలయ కంటి ఆసుపత్రి, జిల్లా కంటి నష్ట నివారణ సొసైటీ ఆధ్వర్యంల్లో 21వ వార్షికోత్సవంలో భాగంగా ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. 300మందికిపైగా పరీక్షలు చేయించుకోగా 150 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. అదేవిధంగా 41 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలకు సిఫారసు చేశారు.



అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

సరిహద్దులో పోలీసుల తనిఖీలు

హోసూరు, మార్చి 4: బెంగళూరు రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్ల ఘటన నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను ముమ్మరం చేశారు. హోసూరుకు సరిహద్దులో ఉన్న బన్నేరుఘట్ట నేషనల్ జూలాజికల్ పార్క్, బెంగళూరు మెట్రోపొలిటన్ ఏరియాలోని లాల్‌బాగ్, ఇతర పార్కులను స్క్రీనింగ్ తర్వాతే సందర్శించడానికి విదేశీయులకు అనుమతిస్తున్నారు. సరిహద్దులోని జూజూవాడి చెక్ పోస్టులో వాహనాలను తీవ్రంగా పరిశీలించాకే అనుమతిస్తున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలోనూ తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా గుర్తిస్తే తెలియచేయాలని పోలీసుశాఖ ప్రజలకు సూచించింది.



బ్యాగులను పరిశీలిస్తున్న పోలీసులు

డీఎంకే ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలు

హోసూరు, మార్చి 4: హోసూరులో రాంనగర్ అన్నా విగ్రహం ఎదుట తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జన్మదినాన్ని పురస్కరించుకుని డీఎంకే ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేయర్ సత్య, హోసూరు ఎమ్మెల్యే వై ప్రకాశ్ అధ్యక్షత వహించారు. సభికులకు పలు కానుకలు అందజేశారు. ప్రత్యేక అతిథి ప్రసంగిస్తూ డీఎంకేను ఎవ్వరు అణిచివేయలేరన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 40 నియోజక వర్గాల్లోను డీఎంకే విజయం సాధిస్తుందన్నారు. తదుపరి ప్రధానిగా డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ గుర్తిస్తామన్నారు. గత ఎన్నికల్లో ఒక స్థానం మినహా మిగిలిన చోట్ల విజయం సాధించామని, ఈసారి అన్ని స్థానాలు కైవశం చేసుకుంటామన్న ధీమా వ్యక్తం చేశారు. కాగా మహిళలకు ప్రత్యేక సాయం కింద ఇంతవరకు 1.15 కోట్లమందికి వెయ్యి రూపాయల సాయం ఇచ్చారన్నారు. అవయవదానం చేసిన వారికి ప్రభుత్వ తరపున గౌరవం, ఇంటింటికి వైద్యం, ఇంటింటికి విద్య, మహిళలకు ఉచిత బస్సు ప్రయణం ఇలా ఎన్నో పథకాలు అమలు చేసిన ఘనత సీఎం స్టాలిన్‌దేనన్నారు. రూ.25 కోట్లతో హోసూరు కార్పొరేషన్ రోడ్ల నిర్వహణ, తళి రోడ్డు, కెలమంగలం రోడ్డుతో సహా పలు రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. హొగేనేకల్ ప్రాజెక్టు త్రాగు నీటి పథకం, ఉమ్మడి తాగునీటి పథకం ప్రాజెక్టు, ఇలా ఎన్నెనో పలు పథకాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో హోసూరు నియోజకవర్గం ఇన్‌చార్జీ రమేశ్, జిల్లా ఉప కార్యదర్శులు మురుగన్, పుష్ప సర్వేశ్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎల్లోరమణి, జిల్లా కోశాధికారి సుకుమారన్, రాష్ట్ర మైనార్టీ డివిజన్ ఆసి లాలార్ విజయకుమార్, రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి శ్రీనివాసన్, వీరారెడ్డి, టీమ్ లీడర్లు మాదేశ్వరన్, చెన్నీరప్ప, మున్సిపల్ నిర్వాహకులు సెందిల్‌కుమార్, రవికుమార్, కార్యదర్శులు ఆనందయ్య, రాము, తిమ్మరాజు, గాంధీమదికన్నన్, నిర్వాహకులు రాజా, గిరీశ్, శక్తివేల్ పాల్గొన్నారు.



కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య

హత్య కేసులో ఏడుగురి అరెస్ట్

హోసూరు, మార్చి 4: హోసూరు సరిహద్దులోని కర్ణాటక మరసూరు గ్రామంలో ముఠాలు ఓ యువకుడిని నడిరోడ్డుపై నరికి చంపిన ఘటనలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. 2017లో మనోజ్‌బబ్లూను హత్య చేసిన కేసులో ఆనేకల్ సూర్యనగర్ మరసూరుకు చెందిన విజయకుమార్(27) నిందితుడిగా ఉన్నాడు. ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యాడు. విజయకుమార్‌కు వారం రోజులక్రితం ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారుజామున 4గంటలకు మొబైల్‌కు కాల్ వచ్చింది. ఫోన్ మాట్లాడి బయటకు పిలిచిన దుండగులు ఇంటి ముందు రోడ్డుపై ఆయుధాలతో దాడి చేసి హత్య చేసి పరారైయ్యారు. ఈకేసును తీవ్రంగా పరిగణించి బెంగళూరు జిల్లా గ్రామీణ ఎస్పీ మల్లికార్జున్ బాలదండి కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రాథమిక విచారణలో మనోజ్ బబ్లూ హత్యకు ప్రతీకారం తీర్చుకునేందుకి విజయకుమార్‌ను హతమార్చినట్టు గుర్తించారు. సూర్యనగర్ పోలీసులు సోమవారం అదే ప్రాంతానికి చెందిన అర్జున్, భాస్కర్, మహేశ్, మురుగేశ్, హేమంత్, సందీప్, పునీత్‌లను అరెస్టు చేశారు. విచారణలో పగ తీర్చుకునేందుకే హత్యకు పాల్పడినట్టు నిందితులు అంగీకరించారని పోలీసులు తెలిపారు. నిందితులను పరప్పన అగ్రహార జైలుకు తరలించారు.

కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలి

● బీజేపీ తాలూకా అధ్యక్షుడు మల్లికార్జున స్వామి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ తాలూకా అధ్యక్షుడు మల్లికార్జున స్వామి

సిరుగుప్ప, మార్చి 4 : రానున్న పార్లమెంట్ ఎన్నికలను ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ తాలుకా అధ్యక్షులు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి పిలుపునిచ్చారు. సోమవారం సిరుగుప్ప పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో లోక్ సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో కార్యకర్తల సమావేశం జరిగింది. మల్లికార్జున స్వామి మాట్లాడుతూ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మైకెల్ వీరేష, జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ ఉలిగప్ప, సీనియర్ నాయకులు దమ్మూరు సోమప్ప పాల్గొన్నారు.

తొమ్మిది గడ్డివాములు దగ్ధం

కంప్లి, మార్చి 4 : తాలుకా పరిధిలోని నెల్లూడి కొట్టాల గ్రామంలో ఆదివారం రాత్రి అకస్మాత్తుగా మంటలు రేగి తొమ్మిది గడ్డివాములు దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు పశువుల మేత కోసం దాచుకున్న గడ్డి మం టలు చెలరేగి దగ్ధమయ్యాయని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లింద న్నారు. ఎమ్మెల్యే జేఎన్ గణేష్ అక్కడకు చేరుకుని రైతులను ఆదుకుంటామని తెలిపారు. లక్షల్లో నష్టం వాటిల్లిందని హోంమంత్రి పరమేశ్వర్‌కు ఫోన్‌లో వివరించారు. స్పందించిన మంత్రి నష్టపరిహారం చెల్లించాలని తహసీల్దార్ శివరాజ్‌కు సూచించారు.



దగ్ధమవుతున్న గడ్డివాములు



బాధితురాలు గౌరమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

ఈలపాట రఘురామయ్య (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత ఈలపాట రఘురామయ్యగా పేరొందిన కల్యాణం వెంకట సుబ్బయ్య 1901 మార్చి 5న గుంటూరు జిల్లా సుద్దపల్లి గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచి నాటకాలు వేశారు. ప్రత్యేకించి రఘురాముని పాత్ర వేయడంలో రాణించడం కాశీ నాథుని నాగేశ్వరరావు ఆయనను రఘురామయ్యగా పిలిచారు. సుప్రసిద్ధ రంగస్థల, సినిమా నటుడు, గాయ కుడుగా పేరొందారు. నాటకాలలో ఈలవేసి పద్యాలు, పాటలు పాడి శ్రోతలను మంత్రముగ్ధులు చేసేవారు. దీంతో ఈయన 'ఈలపాట రఘురామయ్య'గా గుర్తింపు పొందారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆయనను 'నాటక కోయిల'గా ప్రశంసించారు. సంగీత నాటక అకాడమీ ఇతర పురస్కారాలు అందుకున్నారు. 1975 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

గంగూబాయి హానగల్ (జయంతి)




గంగూబాయి హానగల్ 1913 మార్చి 5న కర్ణాటక రాష్ట్రం ధార్వాడలో జన్మించారు. కిరాణా ఘరానా శైలి హిందూస్తానీ సంగీత విద్వాంసురాలు. దత్తోపంత్ దేశాయ్ వంటి గురువుల వద్ద శిక్షణ పొంది 'లేడీ ఆఫ్ ఖయాల్'గా పేరొందారు. కర్ణాటక యూనివర్సిటీలో సంగీతం గౌరవ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. ఆలిండియా రేడియోలోనూ ఆమె ప్రదర్శనలు ఇచ్చారు. 2006 లో చివరి కచేరీ ప్రదర్శించారు. పద్మభూషణ్, పద్మ విభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర అవార్డులు అందుకున్నారు. 2009 జూలై 21న కన్ను మూశారు.

బిజు పట్నాయక్ (జయంతి)



బిజు పట్నాయక్ 1916 మార్చి 5న ఒడిశా రాష్ట్రం కటక్ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు బిజయానంద్ పట్నాయక్. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ప్రైవేట్ విమానంలో పైలట్‌గా పనిచేశారు. తర్వాత రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరారు. తర్వాత రాజ కీ యాల్లో రాణించి కాంగ్రెస్‌లోనూ, జనతాదళ్ పార్టీలలో వివిధ హోదాలలో రాణించారు. ఒడిశా రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. కేంద్ర మంత్రిగానూ వ్యవహరించారు. 1997 ఏప్రిల్ 17న కన్నుమూశారు.

మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి (జయంతి)



మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 1920 మార్చి 5న కోనసీమ జిల్లా అమలాపురం తాలూకా ఐలెండు పోలవరం గ్రామంలో జన్మించారు. తెలుగు సాహిత్యంలో పేరొందిన కవులలో ప్ర ముఖులు. ఆంధ్ర కల్హణ, కళా ప్రపూర్ణ బిరుదాంకితులు. పదో యేటనే పద్యాలు రాయడం మొదలు పెట్టిన ఘనత ఆయనది. 1938 లో తొలి ఖండకావ్యం తోరణము వెలువడింది. భాషపై అభిమానంతో 'ఆంధ్రి' మాసపత్రికను ప్రారంభించారు. ఇందులో ఎంతోమంది కవులు, రచయితలు, పండితుల రచనలు ముద్రించబడ్డాయి. కాగా ఆయన రచించిన 'ఆంధ్ర పురాణం' కృతికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకా డమీ అవార్డు దక్కింది. 1992 నవంబరు 7న కన్నుమూశారు.

వి. కోటేశ్వరమ్మ (జయంతి)



వేగా కోటేశ్వరమ్మ 1925 మార్చి 5న కృష్ణాజిల్లా గోసాల గ్రామంలో జన్మించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పేరొందారు. 1940 దశకంలో విజయవాడ తాలూకాలో తొలి పట్ట భద్రురాలు కావడం ప్రత్యేకత. మాంటిస్సోరి మహిళా విద్యాసంస్థల సంస్థాపకురాలు. 53కుపైగా పుస్తకాలు ప్రచురించారు. 92వ యేట 2017లో 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు. 2019 జూన్ 14న కన్నుమూశారు.

అలిక్ పదంసీ (జయంతి)



అలిక్ పదంసీ 1928 మార్చి 5న ముంబైలో జన్మించారు. పలు ప్రతిష్ఠాత్మక ప్రకటనలకు సృష్టి కర్త. దేశంలో అంతర్జాతీయ ప్రక టనల సంస్థ లింటాస్‌కు 1980 నుంచి 1994 వరకు చీఫ్ ఎగ్జి క్యూటివ్‌గా వ్యవహరించి ఆ సంస్థను అగ్రశ్రేణి ప్రకటనల సంస్థగా తీర్చిదిద్దారు. 1982 లో చారిత్రాత్మక సినిమా 'గాంధీ'లో మహ్మద్‌అలీ జిన్నా పాత్రలో నటించి అందరి మన్ననలు అందుకున్నారు. తన 60ఏళ్ల కెరీర్‌లో 70కుపైగా నాటకాలకు దర్శకత్వం వహించారు. ఎవిటా, జీసస్ క్రైస్ట్ సూపర్‌స్టార్, తుగ్లక్ వంటి నాటకాలు ప్రాచుర్యం పొందాయి. 2018 నవంబరు 17న కన్నుమూశారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

▸▸ రామనగర జిల్లాలో తహసీల్దార్‌పై కుట్ర

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రామనగర జిల్లా హారోహళ్ళి తాలూకా భీమసంద్ర వద్ద గోమాళ భూములలో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న వారిని అడ్డుకునేందుకు వెళ్లిన తహసీల్దార్ విజయణ్ణపై హత్యాయత్నం జరిగింది. ఈమేరకు హారోహళ్ళి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిబ్రవరి 29న భీమసంద్ర వద్ద మట్టి తవ్వకాలను పరిశీలించి అడ్డుకునేందుకు తహసీల్దార్ సిబ్బందితోపాటు వెళ్లారు. మట్టితో వస్తున్న లారీని ఆపేందుకు తహసీల్దార్ ప్రయత్నించగా ఢీ కొట్టి హత మార్చేందుకు సిద్ధమయ్యారు. వారి నుంచి తప్పించుకున్న తహసీల్దార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. లారీ డ్రైవర్ సహా, మట్టి తవ్వుతున్న అక్రమార్కులు పరారీలో ఉండగా సోమవారం పలువురిని అరెస్టు చేశారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఇసుక మాఫియా, మట్టి అక్రమ రవాణాకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు ప్రకటించారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నేరాలు, అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

నమోదు చేసుకోని వాటర్ ట్యాంకర్ల స్వాధీనం

▸▸ ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ హెచ్చరిక

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు నగరంలో వేసవి తీవ్రత నేపథ్యంలో ప్రజల తాగునీటి దాహార్తి తీర్చేందుకు రూ.556 కోట్లను అందుబాటులో ఉంచామని నగర జిల్లా ఇన్‌చార్జ్‌గా ఉన్న ఉప ముఖ్య మంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. బీబీఎంపీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన తాగునీటి ఎద్దడిపై ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమా వేశమయ్యారు. బెంగళూరులో 3500 వాటర్‌ట్యాంకర్‌లు ఉండగా కేవలం 10శాతం మాత్రమే రిజిస్టర్ అయ్యాయన్నారు. జలమండలి నిర్వహణలో ప్రస్తు తం 210 ట్యాంకర్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. నగరంలో నీటిపై పూర్తి హక్కులు ప్రభుత్వానివేనని, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. బీబీఎంపీలో రూ.148 కోట్లు, జలమండలిలో రూ.128 కోట్లు ప్రత్యేకంగా తాగునీటి అవసరాలకోసమే కేటాయించారన్నారు. నగర వ్యాప్తంగా 16,781 బోరుబావులు ఉండగా 6,997 బోరుబావుల్లో నీరు పూర్తిగా ఇంకిపోయిందని, 7,784 బోరుబావుల్లో మాత్రమే నీరు అందు బాటులో ఉందన్నారు. వీటిలో చాలావరకు నీరు అదు గంటిందన్నారు. నగరంలో నీటి ఎద్దడి ఎక్కడా లేదని సమస్యల జఠిలంగా ఉన్న ప్రాంతాలలో జలమండలి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. నీటి తీవ్రత అధికంగా ఉండే ప్రాంతాలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించామన్నారు.



సమావేశంలో డీసీఎం డీకే శివకుమార్

కన్నడ కార్యక్రమాలపై శ్రద్ధ పెరగాలి

▸▸ తాలూకా సాహిత్య సమ్మేళనంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి



తాలూకా కన్నడ సాహిత్య సమ్మేళనం ప్రారంభంలో ప్రముఖులు

బాగేపల్లి, మార్చి 4: కన్నడ రాజ్యోత్సవం, కన్నడ సాహిత్య సమ్మేళనం సహా కన్నడ కార్యక్రమాల్లో ప్రజలు మరింతగా భాగస్వామ్యం అయ్యేలా శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో సోమవారం ఏర్పాటైన తాలూకా 6వ కన్నడ సాహిత్య సమ్మేళనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇటీవలికాలంలో కన్నడ కార్యక్రమాల్లో ప్రజలభాగస్వామ్యం తగ్గిందని ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధశాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు, ప్రజల్లో కన్నడ భాష, సాహిత్యంపై అభిమానం, అభిరుచి తగ్గిందన్నారు. సాహితీవేత్తలు ఉత్తమ కథ, నవలలు, కవితలు రాస్తారని వాటిని భావి తరాలకు అందించేలా చూపాల్సిన చొరవ మనపై ఉందన్నారు. భాషాభిమానం తగ్గితే మాతృ భాష మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో కన్నడ కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలన్నారు. త్వరలోనే బాగేపల్లి పేరును భాగ్యనగరగా మరునామకరణం చేస్తామని, వచ్చే కన్నడ రాజ్యోత్సవానికి కన్నడ భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆరవ తాలూకా కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షుడు ఎస్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతం కావడంతో కన్నడ కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కన్నడ సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మహేశ్ జోషి, జిల్లా అధ్యక్షుడు కోడి రంగప్ప, తాలూకా అధ్యక్షుడు కృష్ణారెడ్డి ప్రసంగించారు. తొలుత సమ్మేళనం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌ను తాలూకా కసాప ఆధ్వర్యంలో ఓపెన్‌టాప్ వాహనంలో ఊరేగింపుగా ఆత్మీయంగా స్వాగతించారు. డొళ్ళు కుణిత, మంగళవాద్యం తదితర కళాబృందాలు, కన్నడ, రైతు సంఘాల ముఖ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్, సీఐ ప్రశాంత్ వర్ణి, పురసభ ముఖ్యఅధికారి శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

నకిలీ-ఎ ఖాతాలతో పాలికెకు రూ.కోట్లలో నష్టం

బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): యశ్వంతపుర శాసనసభా నియోజకవర్గం పరిధిలోని కింగేరి ఉప విభాగం హెమ్మిగెపుర వార్డులో గత నెల 200 ఆస్తులకు సంబంధించి నకిలీ-ఎ ఖాతాలను సృష్టించారని బీజేపీ ఆరోపించింది. బెంగళూరు దక్షిణ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఎన్ ఆర్ రమేష్ సోమవారం ఈ మేరకు లోకాయుక్తకు, బీబీఎంపీ కమీషనర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నకిలీ ఎ ఖాతాల కారణంగా బీబీఎంపీకి రూ.15 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని పైగా రూ.5 కోట్ల మేరకు లంచం చేతులు మారిందని ఆరోపించారు. బతికిఉన్న వారి పేర్లతో డెత్‌సర్టిఫికెట్లు సృష్టించి మరీ ఈ కుంభకోణానికి పాల్పడ్డారని దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తే నిజాలు నిగ్గు తేలుతాయన్నారు. బీబీఎంపీ అధికారులు దేవరాజు, అబ్దుల్ రబ్. వి.అజయ్, డా.బసవరాజ మగ్గి ఈ అవినీతి వ్యవహారంలో కుమ్మక్కయారని ఒక ప్రైవేట్ సంస్థకు మేలు చేసేందుకుగాను నకిలీ ఎ ఖాతాలను సృష్టించారని ఆయన ఆరోపించారు. పూర్తి ఆధారాలను కర్ణాటక లోకాయుక్త అధికారులకు సమర్పించారని దీనిపై చర్యలు తీసుకుంటారన్న నమ్మకం తమకు ఉందన్నారు. బీబీఎంపీ కమీషనర్ గత కొద్దికాలంగా క్లియర్ చేసిన అన్ని ఎ ఖాతాలను ఒకసారి కూలంగా కుషంగా పరిశీలించాలని ఆయన సూచించారు. ఎ ఖాతాల రూపంలో బీబీఎంపీకి లక్షలాది రూపాయల బెటర్‌మెంట్ చార్జీలు వస్తాయని కొందరు అవినీతి అధికారుల కారణంగా పాలికెకు ఎంతగానో నష్టం వాటిల్లుతోందని ఆయన పేర్కొన్నారు.



ఫిర్యాదు లేఖను చూపుతున్న రమేష్

ఘంటసాల సంగీత వైభవం అజరామరం



పురస్కార గ్రహీతలు వీరే..

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'పద్మశ్రీ' ఘంటసాల వెంక టేశ్వరరావు సమకూర్చిన సంగీత బాణీ, ఆయన స్వరం నుండి జాలువారిన మధుర గీతాలు సంగీత వైభవానికి అజరామరమని ప్రముఖ సంగీత దర్శకుడు డా.హంసలేఖ పేర్కొన్నారు. రంగమ్మ భీమప్ప శెట్టి లలిత కళా ట్రస్టు, చెన్నైకు చెందిన కళాప్రదర్శిని సంస్థలు సంయుక్తంగా నగరంలోని ఏడీఏ రంగ మందిరంలో ఘంటసాల శతజయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమ వేదికపై ఆయన కళా ప్రదర్శిని ఘంటసాల పురస్కారాన్ని అందుకున్నారు. ఇదే వేదికపై నుపుర భరతనాట్యం స్కూల్‌కు చెందిన సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డా.లలిత శ్రీనివాసన్, చిదంబరం అకాడమీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌కు చెందిన పద్మశ్రీ ప్రొఫెసర్ చిత్రా విశ్వేశ్వరన్, సంగీత కళాచార్య డాక్టర్ టీఎస్ సరస్వతి కూడా పురస్కారాలను అందుకున్నారు. ఈ వేడుకకు పూర్వ రాజ్యసభ సభ్యుడు కేసీ రామమూర్తి మాట్లాడుతూ అమర గాయకుడు ఘంటసాల పాడిన అద్భుతపాటలు సంగీత రంగంలో చిరస్థాయిగా శ్రోతహృదయాల్లో పదిలంగా ఉండిపోతాయన్నారు. మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన జస్టిస్ మంజులా చెల్లూరు ఈ వేడుకకు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. తమ తండ్రి రంగస్థల నటుడు భీమప్ప శెట్టిగారి శతజయంతి ఘంటసాలగారి శతజయంతి నాడే జరగడం పూర్వజన్మ సుకృతమన్నారు. అనంతరం గాన గంధర్వుడు ఘంటసాల పాటలకు అనుగుణంగా పలువురు కళాకారులు చేసిన నృత్యాలు సభికుల్ని విశేషంగా అలరించాయి. కలైమామణి పార్వతిరవి ఘంటసాల సారథ్యంలో ఈ కార్యక్రమం కనులపండువగా జరిగింది.



ఘంటసాల పాటలకు నృత్యం

పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించిన యువమోర్చా

బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు తాము సోమవారం తలపెట్టిన తిరంగా యాత్రను పోలీసులు అడ్డుకోవడాన్ని బీజేపీ యువమోర్చా తీవ్రంగా ఖండించింది. యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ధీరజ్ మునిరాజ్ బెంగళూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ వెయ్యి అడుగుల పొడవైన జాతీయ పతాకాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం విచారకరమన్నారు. కార్యకర్తలను అరెస్టు చేసి ఒకే బస్సులో కుక్కారని ఆరోపించారు. టౌన్‌హాల్‌నుంచి తాము చేపట్టిన ఈ యాత్రను అడ్డుకుంటూ పోలీసులు జరిపిన దౌర్జన్యం దారుణమన్నారు. తాము వ్యతిరేకంగా ఈ కార్యక్రమం చేపట్టలేదని స్పష్టం చేశారు. సచివాలయంలో పాక్ అనుకూల నినాదాలు చేసిన, రామేశ్వరం కెఫెలో బాంబులు పేల్చిన ఘటనలో నిందితులను పట్టుకోవడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, దేశభక్తులను వేధిస్తోందని ఆరోపించారు.



టౌన్‌హాల్ వద్ద బీజేపీ యువమోర్చా ధర్నా

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి ఆత్మహత్య

▸▸ అప్పులబాధతో గదగ్ జిల్లాలో దారుణం

బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గదగ్ జిల్లా లక్ష్మేశ్వర తాలూకా గోనాళ గ్రామానికి చెందిన ఓ కుటుంబం అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. అప్పుల బాధ భరించలేక హావేరి జిల్లా ఎళవిగి రైల్వే స్టేషన్ వద్ద తల్లి రేణవ్వ తేలి (49), కుమారుడు మంజునాథ్ తేలి (26)లు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలియగానే ఇంట్లో ఉండే రేణవ్వ సోదరి సావక్కతేలి (47) కూడా మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ట్రాక్టర్ లోన్ మొత్తం చెల్లించే విషయంలో తల్లీ కొడుకు గొడవపడినట్టు తెలుస్తోంది. కుమారుడు మంజునాథ్ ఆవేశంతో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిన సమయంలోనే తల్లి కూడా మంజునాథ్ వెంట వెళ్లి ఆమె కూడా రైలుకిందపడ్డారు. ఘటనపై లక్ష్మేశ్వర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



కుటుంబికులు (ఫైల్)

రోడ్డు పనులను పరిశీలించిన మంత్రి

శిడ్లఘట్ట, మార్చి 4: తాలూకా లోని హెచ్ క్రాస్‌లో డాంబ రీకరణ పనులను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ సోమవారం పరిశీలించారు. హొస్కోటె నుంచి చింతామణి వరకు డాంబరీకరణ పనులు సాగు తున్నాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత బడ్జెట్‌లో దేవనహళ్ళి నుంచి కోలారు వరకు చతుష్పథ రోడ్డు చేయాలని ప్రతిపాదించారన్నారు. తాలూకాలోని హెచ్‌క్రాస్ జంక్షన్‌లో వాహన రద్దీతో ట్రాఫిక్ జామ్ అవుతోందన్నారు. టోల్ ప్లాజా వద్ద మార్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డాంబరీకరణ కోసం హొస్కోటె నుంచి చింతామణి వరకు రూ.38.5 కోట్ల గ్రాంటు విడు దలైందన్నారు. న్యాయపరమైన సమస్యల కారణంగా పనులు ఆలస్యమ య్యా యన్నారు. ప్రస్తుతం పనుల్లో నాణ్యత పాటించేలా అధికారులకు సూచనలు చేశామన్నారు. ప్రజాపనులశాఖ చీఫ్ ఇంజనీర్, తహసీల్దార్ బీఎన్ స్వామి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు మంత్రి సుధాకర్ సూచనలు

స్థానిక ప్రతిభావంతులకు ప్రోత్సాహం

మహదేవపుర, మార్చి 4: కాటంనల్లూరులోని మంజునాథస్వామి కల్యాణమండపంలో భారతమాత పూజా కార్యక్రమాన్ని పద్మశ్రీ, అర్జున పురస్కార గ్రహీత చార్ల్స్ బోరోమియో, ఎమ్మెల్యే అరవింద లింబావళి, బిగ్‌బాస్ ఫేం వర్తూరు సంతోష్ ప్రారంభించారు. ఏటా స్థానిక ప్రతిభావంతులను ప్రోత్సహించేలా పాఠశాల విద్యార్థులు, కళా బృందాలచే భరతనాట్యం, సంగీతం, నృత్యం డొళ్ళుకుణిత, ధ్వజస్తంభ కుణిత, రసమంజరి తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇదే రీతిన ఈ ఏడాది కూడా ఇలా ఆదివారం నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. హళ్ళికార్ ఒడెయగా పేరొందిన వర్తూరు సంతోష్ మాట్లాడుతూ మాజీ మంత్రి అరవింద లింబావళి నేతృత్వంలో హళ్ళికార్ రేస్ నిర్వహిస్తామని తెలిపారన్నారు. ఈ సందర్భంగా క్రీడలు, సంగీతం, విద్య సహా వివిధ రంగాలలో 32మంది సాధకులను ఎమ్మెల్యే మంజుళా లింబావళి దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి బీవీ రాజేశ్, బీజేపీ నాయకుడు సప్తగిరిగౌడ, మనోహర్‌రెడ్డి, నటరాజ్, ఎల్ రాజేశ్, హరాడి పిళ్ళప్ప, వెంకటస్వామిరెడ్డి, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి లింబావళి పూజలు

ఆయుష్మాన్ భారత్ ద్వారా 77 లక్షల మందికి చికిత్స

బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జనారోగ్య పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 77లక్షల మంది లబ్ధి పొందారని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ముఖ్యమంత్రి ఆరోగ్య కర్ణాటక పథకం ద్వారా లబ్ధి పొందినవారు కూడా ఇందులో ఉన్నారని పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో వీరంతా ఉచితంగా చికిత్స పొందారని, నామమాత్రపు రుసుం చెల్లించి ఉత్తమ ఆరోగ్యాన్ని సాధించారని ఆరోగ్యశాఖ కమిషనర్ డీ రణదీప్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పథకం ప్రారంభమైనప్పటి నుంచి మొత్తం 77లక్షల మంది లబ్ధి పొందినట్టు వివరించారు. ఆయుష్మాన్ భారత్ సేవలు ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చేదిశలో జిల్లా, తాలూకా ఆసుపత్రులలో ప్రత్యేక కియోస్కులను ఏర్పాటు చేయాల్సిందిగా జాతీయ ఆరోగ్య ప్రాధికార సూచించిందన్నారు. ఈ దిశలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు. మార్చి 15లోగా కియోస్కులను ఏర్పాటు చేసే దిశలో సన్నాహాలు ప్రారంభించామన్నారు.

కలబురగి యువకులను రష్యా నుంచి రప్పిస్తాం

▸▸ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖపై కేంద్రమంత్రి జైశంకర్

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రష్యాలో చిక్కుకున్న కలబురగికి చెందిన ముగ్గురితో పాటు తెలంగాణకు చెందిన ఒక యువకుడిని రక్షించి దేశానికి వాపసు తీసుకువచ్చే చర్యలు చేపట్టామని కేంద్రవిదేశీ వ్యవహారాల శాఖా మంత్రి జైశంకర్ తెలిపారు. మల్లికార్జున ఖర్గే సొంతూరు కలబురగిలో ఆదివారం కేంద్రమంత్రి జైశంకర్ మీడియాతో మాట్లాడుతూ కలబురగికి చెందిన ముగ్గురు యువకులు రష్యా దేశంలోని యుద్ధప్రాంతాలలో చిక్కుకున్న విషయమై కాంగ్రెస్ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జునఖర్గే లేఖ రాశారన్నారు. రష్యాదేశ అధికారులతో భారత రాయబార కార్యాలయం ఉద్యోగులు చర్చలు జరుపుతున్నారన్నారు. కేంద్రప్రభుత్వం ప్రజల రక్షణకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. భారతీయుల రక్షణ విషయమై మాస్కోలోని భారతీయ రాయబార కార్యాలయ అధికారులకు సూచనలు ఇచ్చామన్నారు. యుద్ధపీడిత ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించామన్నారు.

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నేటి నుంచి నారీశక్తి యాత్ర

బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో నారీశక్తి యాత్ర జరగనుంది. బెంగళూరు మల్లేశ్వరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు సీ మంజుళ మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 6వరకు దేశ వ్యాప్తంగా నారిశక్తి యాత్ర జరుగుతోందని ఇందులో భాగంగా రాష్ట్రంలోనూ స్కూటీ, బైక్, సైకిళ్లపై మహిళా కార్యకర్తలు యాత్రలో పాల్గొంటారన్నారు. నగర ప్రదేశాల్లోని స్వసహాయ గ్రూప్ గ్రామీణ ప్రాంతాల్లోని సంజీవని గ్రూప్ మహిళా సభ్యులు కూడా నారిశక్తి యాత్రలో పాలు పంచుకుంటారన్నారు. ఇదే సందర్భంగా రాష్ట్రంలోని కాంగ్రెస్, టీఎంసీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న అత్యాచార ఘటనలను తీవ్రంగా ఖండించారు. బీజేపీ మహిళామోర్చా ఆధ్వర్యంలో రన్ ఫర్ నేషన్, రన్ ఫర్ మోదీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించబోతున్నామన్నారు. ఉత్తర జిల్లా అధ్యక్షురాలు ఆశారావు, మహిళా మోర్చా సెంట్రల్ జిల్లా అధ్యక్షురాలు రేఖా గోవింగ్, దక్షిణ జిల్లా అధ్యక్షురాలు మీనాక్షి ఆనంద్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

శివబాలయోగి ఆశ్రమంలో మహాశివరాత్రి వేడుకలు

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బెంగళూరు జేపీ నగర్‌లోని శివ బాలయోగి ఆశ్రమంలో మహాశివరాత్రి వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ట్రస్టు చైర్మన్ రాంబాబు నగరంలో సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆలయంలో యామపూజలు మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 6 గంటలకు, రాత్రి 9 గంటలకు, అర్ధరాత్రి 12 గంటలకు తిరిగి మరుసటిరోజు తెల్లవారు జామున 3 గంటలకు ఉంటాయన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వాసవి మహిళామండలి బృందంచే భక్తిగీతాలతో వేడుకలు ప్రారంభం కానున్నాయన్నారు. సాయంత్రం 4 గంటలకు చక్ర భజనామండలి చే భక్తిగీతాలాపన ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు ఎస్ఎల్‌వీబీఎం భజన మండలిచే భక్తిగీతాలు, సాయంత్రం 6 గంటలకు స్వర మాధుర్య బృందంచే భరతనాట్యం, అనంతరం శ్వేతశ్రీనివాస్‌చే శక్తి యక్షగాన ప్రదర్శన ఉంటాయి. రాత్రి 7.45కు రత్నమాల పురందర్ బృందంచే భక్తిగీతాలాపన జరుగనుంది. తదుపరి విశ్వభారతి నాట్యశాల విద్యార్థులచే భరతనాట్యరూపకం ఉంటుంది. రాత్రి 12 గంటల నుండి సింధు భైరవి కళా బృందంచే భూ కైలాస నాటక ప్రదర్శన జరుగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరమశివుని అనుగ్రహాన్ని పొందాలని ప్రకటనలో కోరారు.

కులగణన నివేదికపై అప్పుడే చర్చలు సరికాదు

▸▸ జయప్రకాశ్ హెగ్డే

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా కాంతరాజ్ అధ్యక్షతన జరిగిన కులగణన నివేదికను అప్పగించామని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జయప్రకాశ్ హెగ్డే తెలిపారు. ఉడుపిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కులగణన నివేదిక అధికారికంగా విడుదలయ్యాక చర్చలు జరపడం సమంజసమని, ఇంకా నివేదికలో ఏం ఉందో తెలియకుండానే ఎవరికివారుగా అభిప్రాయాలు వ్యక్తం చేయడం సరికాదన్నారు. కులగణన నివేదిక అధ్యయనం వేళ 1.30 కోట్ల నివాసాలకు వెళ్లారని, 5.98 కోట్లమంది ప్రజల సమాచారం తెలుసుకున్నారన్నారు. నివేదికను ప్రభుత్వం అంగీకరించి వివరాలు ప్రకటించేవరకు బహిరంగంగా చర్చలు జరపరాదన్నారు. ప్రభుత్వం అధికారికంగా విడుదల చేశాక తప్పులుంటే సర్దుబాటుకు అవకాశం ఉందన్నారు. ఒక కుటుంబానికి సంబంధించి 54 ప్రశ్నలు ఉంటాయని, అందులో కులం కూడా ఒక భాగమన్నారు. కులం కోసం సమీక్ష జరగలేదని, బీసీ వర్గాల సామాజిక విద్యతోపాటు పలు అంశాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలన్నారు. నివేదిక అశాస్త్రీయమని వాదించేముందు ఎంతమేర అవగాహన పొందారనేది ముఖ్యమన్నారు. నివేదిక బహిరంగం కాకముందే ఎలా ఆరోపణలు చేస్తారన్నారు. సమాజంలో సమానత్వం తీసుకొచ్చేందుకు రిజర్వేషన్ వచ్చిందన్నారు. అధ్యయన నివేదికలో 1300 కుపైగా కులాలు, తెగలను గుర్తించామన్నారు. చిన్న కులాల ప్రస్తావన కూడా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఎటువంటి సమాచారం సేకరించలేదన్నారు. అందుకు మరో కమిషన్ ఉందన్నారు. ఎక్కడో గదిలో కూర్చుని అధ్యనం చేయలేదన్నారు. కాగా ఉడుపి - చిక్కమగళూరు నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారా..? అనే ప్రశ్నపై బదులిస్తూ ఎన్నికలపై ఇంకా ఎవరితో చర్చలు జరపలేదన్నారు.

ఆరోపణలు నిరాధారం

▸▸ బీజేపీ ఎమ్మెల్యే శివరాం హెబ్బార్

బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల్లో అనారోగ్యం కారణంగానే ఓటు వేయలేకపోయానని స్పష్టం చేసినప్పటికీ బీజేపీ నేత ఈశ్వరప్ప నిరాధార ఆరోపణలు చేస్తున్నారని సొంత పార్టీ ఎమ్మెల్యే శివరాం హెబ్బార్ విరుచుకుపడ్డారు. శిరసిలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ డబ్బులు ముట్టడం వల్లే తాను తటస్థంగా ఉన్నట్టు ఈశ్వరప్ప చేసిన ఆరోపణలు సరికాదన్నారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలో కూడా భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. మరి బీజేపీ నేతలు వారికి ఏమేరకు డబ్బులు ముట్టజెప్పారో వెల్లడించారని ఆయన సవాల్ విసిరారు. ఇలాంటి ఆరోపణలు చేయడం ద్వారా తన ఘనత, గౌరవాన్ని ఈశ్వరప్ప తగ్గించుకుంటున్నారన్నారు. ప్రస్తుతం బీజేపీలోనే కొనసాగుతున్నానని సమయం, సందర్భం వచ్చినప్పుడు తన రాజకీయ నిర్ణయం ప్రకటిస్తానని శివరాం హెబ్బార్ వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయబోతున్నట్టు మీడియాలో వచ్చిన కథనాలు ఊహాజనితమేనన్నారు.



CHANGE OF NAME

I, Munireddy Sreenivasa (Old Name), R/of D.no:a307, 3rd Floor, Sekhar Hyde Park, Immadihalli, Whitefield, Bangalore, Karnataka, India. I Have Changed My Name To MUNIREDDY SRINIVASA S/o Munireddy (New Name).

AJT - 179581

LAND FOR SALE

కలికిరి మదనపల్లి హైవే నుండి 5 KM దూరంలో, JNTU Eng. College నుండి 5 KM దూరంలో, సైనిక్ స్కూల్ నుండి 4 KM దూరంలో, అన్ని పంటలకు అనుకూలమైన మంచి నీటి వసతి గల వ్యవసాయ భూమి పొలం 70 ఎకరాలు అమ్మబడును. Cell : 94402 71459, 91333 38628.

AJT - 6154

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏబీఎన్